
బీటెక్ 1,3,5 సెమిస్టర్ ఫలితాలు

కర్నూలు(అర్బన్), మే 7: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని బీటెక్ ఇంజనీరింగ్ 1,3,5 సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు ఈ ఫలితాలను వెల్లడించారు. వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంటాయని తెలిపారు. రెగ్యులర్ విభాగంలో 1వ సెమిస్టర్‌లో 170 మందికి 33, 3వ సెమిస్టర్‌లో 164కు 72, 5వ సెమిస్టర్‌లో 164కు 132 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు.





సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మిగిలిన గడువు ఆరు రోజులే. అధికార వైసీపీ నాయకుల్లో ఓటమి భయం వెంటాడుతోంది. ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలను భయాందోళనకు గురి చేస్తున్నారు. దాడులకు తెగబడుతున్నారు. పోలీసులు అప్రమత్తమై ఘర్షణలకు పాల్పడే వారిపై నిఘా పెట్టకపోతే పరిస్థితి దారుణంగా మారే పరిస్థితి ఉందని ప్రతిపక్షాల నాయకులు ఆందోళన చెందుతున్నారు. కోడుమూరు మండలం కృష్ణాపురంలో సోమవారం టీడీపీ ప్రచారంలో ఉన్న కార్యకర్తలపై వైసీపీ వర్గీయులు దాడి చేశారు. ఇది మర్చిపోకముందే ఆలూరు మండలం అంగసకల్లు గ్రామంలో టీడీపీ కార్యకర్తలు ప్రచారం చేయరాదని వైసీపీ కార్యకర్తలు మంగళవారం దాడి చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో ఘర్షణలకు అవకాశం ఉన్న గ్రామాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టామని ఎస్పీ కృష్ణకాంత్ వివరించారు.

ఓటమి భయంతో వైసీపీ దాడులు

దాడిలో గాయపడిన దేవేంద్ర

- కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్తపై దాడి
- ప్రచారం చేయరాదని అంగసకల్లులో బరితెగింపు
- నలుగురు టీడీపీ కార్యకర్తలకు గాయాలు
- భయాందోళన కలిగించడమే వాళ్ల ఉద్దేశం: టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి
- ఘర్షణలు తలెత్తకుండా పల్లెల్లో నిఘా: ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్నూలు పార్లమెంట్ స్థానం సహా కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ సహా వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు 121 మంది బరిలో ఉన్నారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్య పోరు ఉంది. అయితే వైసీపీపై తీవ్ర వ్యతిరేకత, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపట్ల ఆకర్షణ వల్ల ప్రజలు టీడీపీకి జై అంటున్నారు. దీంతో వైసీపీ నాయకులు ఓటమి భయంతో దాడులకు తెగబడుతున్నారు. పోలింగ్ రోజు నాటికి ప్రత్యర్థి పార్టీ కార్యకర్తల్లో భయందోళన కలిగించాలని దాడుల వెనుక ప్రధాన ఉద్దేశమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ఆరోపిస్తున్నాడు. కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామంలో టీడీపీ కార్యకర్త చంద్రశేఖర్ ఆ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం టీడీపీ నాయకులతో పాటు ప్రచారానికి వెళ్లారు. ఇది మనసులో పెట్టుకున్న వైసీపీ కార్యకర్తలు టీడీపీ ప్రచారానికి వెళ్తావా..? అంటూ దాడి చేశారు. ఆయన తలకు బలమైన గాయాలు అయ్యాయి. అయితే.. పోలీసులు మాత్రం వారి మధ్య పొలం దారి విషయంలో గొడవలు ఉన్నాయని, ఆ కారణంగానే ఘర్షణ జరిగిందని పేర్కొనడం కొసమెరుపు. ఈ సంఘటన మరవకముందే ఆలూరు మండలంలో వైసీపీ కార్యకర్తలు పెట్రేగిపోయారు.

టీడీపీ నాయకులు ప్రచారానికి రాకూడదని..

ఆలూరు మండలం మణేకుర్తి పంచాయతీ మజరా గ్రామం అంగసకల్లులో సోమవారం వైసీపీ నాయకులు ప్రచారం చేశారు. మంగవారం టీడీపీ అభ్యర్థికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం చేయాలని ప్లాన్ చేసుకున్నారు. ఉదయం 7.30 గంటల సమయంలో గ్రామంలోని టీ కొట్టు దగ్గర టీడీపీ కార్యకర్తలు రామాజంనేయులు, రమేశ్, భీమలింగ, దేవేంద్ర తదితరులు ఉన్నారు. అక్కడికి వైసీపీ నాయకులు దూదేకొండ వెంకటేశ్, నాగరాజు, ఉలిగప్ప, శీనప్ప, లింగన్న, అశోక్, రవి తదితరులు వచ్చారు. గ్రామంలో టీడీపీ ప్రచారం చేయరాదని బెదిరించారని, దీనికి వాళ్లు.. మా పార్టీ కోసం మేం ప్రచారం చేస్తాం.. మీరెవరు అడ్డుకోడానికి అని ప్రశ్నిస్తే.. మాకే ఎదురు చెప్పుతారా..? అంటూ కర్రలతో దాడి చేశారని బాధితులు వాపోయారు. టీడీపీ కార్యకర్తలు నలుగురి తలలకు బలమైన గాయాలయ్యాయి. ఓటమి భయంతోనే వైసీపీ శ్రేణులు గ్రామాల్లో రెచ్చిపోతున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలనే వ్యూహంలో భాగమే ఈ దాడులని అంటున్నారు.



రామాంజినేయులు | రమేష్ | భీమలింగ



పరామర్శిస్తున్న పాలకుర్తి తిక్కారెడ్డి

దాడి చేస్తే ఊరుకోం : తిక్కారెడ్డి

ఆదోని, మే 7: ఎన్నికల ప్రచారంలో ఉన్న టీడీపీ కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకోమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆలూరు మండలం అంగస్కల్ గ్రామంలో వైసీపీ అల్లరిమూకల దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలు భీమలింగ తదితరులను టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పరామర్శించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కంటే ముందు భయాందోళనలకు గురి చేయడానికే టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. గ్రామాల్లో చిచ్చు పెట్టడం వైసీపీ నాయకులకు అలవాటేనని, ఇక పై చూస్తూ ఊరుకోమని అన్నారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు మనెకుర్తి రాజశేఖర్ ఉన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలు 27.. సమస్యాత్మక కేంద్రాలు

జిల్లాలో 27 ఫ్యాక్షన్ నేపథ్యంగల గ్రామాలు ఉన్నాయి. క్యాట రిగి-1 కింద దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, కృష్ణగిరి మండ లం చెరుకులపాడు గ్రామాలు ఉన్నాయి. 10 గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గాల్లో గతంలో ఎన్నికల సందర్భంగా జరిగిన వివిధ సంఘటనలు దృష్టిలో పెట్టుకొని 338 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. నాలుగు వేల మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. అయినా.. గ్రామాల్లో అక్కడక్కడ ఘర్షణలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పోలింగ్ గడువు సమీపిస్తున్న కొద్ది ఈ గొడవలు పెరిగే అవకాశం ఉంది. అక్రమ మద్యం ఈ ఘర్షణలకు ప్రధాన కారణం అనే పరిశీలన ఉంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు 16-17 వేల లీటర్లు అక్రమ మద్యం సీజ్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. అయినా.. కర్ణాటక మద్యం సరఫరా ఆగడం లేదు. పోలింగ్‌కు ఆరు రోజులే గడువు ఉండడంతో పోలీసులు నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. కొందరు పోలీసు అధికార పార్టీ సేవ లు వీడి.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిష్పక్ష పాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు అంటున్నారు.

ఘర్షణలకు పాల్పడే వారెవరినీ ఉపేక్షించం

జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. 27 ఫ్యాక్షన్ గ్రామాలు, 338 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. అక్కడ ప్రత్యేక పోలీసు నిఘా ఉంచాం. గొడవలకు ఆస్కారం ఉన్న గ్రామాల్లో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పారా మిలటరీ, పోలీసులతో కవాతు నిర్వహించాం. గొడవలకు ప్రధాన కారణం మద్యం. దీంతో అక్రమ మద్యం నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టి 16-17 వేల లీటర్లు అక్రమ మద్యం సీజ్ చేసి.. రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచాం. ఆలూరు మండలం అంగసకల్లు గ్రామంలో జరిగిన ఘర్షణలు పునరావృతం కాకుండా పోలీసులను అప్రమత్తం చేశాం. ఘర్షణలకు పాల్పడే వారెవరిని ఉపేక్షించే ప్రసక్తి లేదు. - జి.కృష్ణకాంత్, ఎస్పీ, కర్నూలు

ఎంపీగా గెలిపిస్తే సస్యశ్యామలం

- కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు
- గార్గేయపురంలో రోడ్‌షోకు భారీగా జనం



మాట్లాడుతున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్), మే7: ఎన్నికల్లో తనను గెలిపిస్తే జిల్లాను సస్యశ్యామలం చేస్తానని కర్నూలు పార్లమెంట్ స్థానం టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. రాష్ట్రంలో తీవ్రంగా వెనకబడిన ప్రాంతం కర్నూలు జిల్లా అని, తనకు ఒక్క అవకాశం ఇస్తే జిల్లా రూపురేఖలు మారుస్తానని ఆయన పేర్కొన్నారు. కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామంలో మంగళవారం టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి నాగరాజు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగు, తాగునీటి వనరులు లేక ప్రతి ఏడాది కరువుతో ప్రజలు వలసపోతున్నారని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చి కరువు, వలసలు నివారిస్తామని నాగరాజు స్పష్టం చేశారు. అలాగే మిషన్ రాయలసీమ ద్వారా తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి రావాలని అన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు గెలుస్తారని, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి తప్పక వస్తుందని అన్నారు. గార్గేయపురంలో మాజీ సర్పంచు కౌలుట్లయ్య, టీడీపీ మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్‌షోకు భారీగా జనం తరలివచ్చారు.



రోడ్‌షోకు భారీగా తరలి వచ్చిన జనం

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు

డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్), మే 7: దాదాపు నెల రోజులుగా ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు బకాయి వేతనాలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కర్నూలు జిల్లా డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో రెండున్నర లక్షల మంది రైతులు, కూలీలు గ్రామాల్లో పనులు చేస్తున్నారని, వీరికి చెల్లించాల్సిన రూ.14 కోట్ల బకాయిలు విడుదలయ్యాయని తెలిపారు. అదేవిధంగా ప్రాధాన్యత క్రమంలో నిర్మిస్తున్న భవనాలకు మెటీరియల్ కంపోనెంట్ కింద రూ.32 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. బకాయిలన్నింటినీ విడుదల చేశారని పీడీ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందు వల్ల పనులు చేసే ప్రదేశాల్లో తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా వడగండ్ల వాన



భారీ వడగళ్లను తీసుకెళ్తున్న ప్రజలు

దేవనకొండ, మే7: జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కర్నూలు నగరంతోపాటు పలు మండలాల్లో వడగండ్ల వాన పడింది. దేవనకొండ మండలంలో రాత్రి 10:30 గంటల సమయంలో కురిసిన వర్షంలో భారీ వడగండ్లు పడ్డాయి. ఒక్కోటి నాలుగైదు కిలోల మేర బరువు ఉండడంతో ప్రజలు చూసి ఆశ్చర్యపోయారు. అదేవిధంగా బైరవానికుంట గ్రామంలో పిడుగుపడి బోయ దొరస్వామికి చెందిన 20 మేకలు మృతి చెందాయి. అదేవిధంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొంతకాలంగా ఎండలతో అల్లాడిపోయిన ప్రజలు తాజాగా కురిసిన వానతో ఉపశమనం పొందారు.

భూములు కాజేసేందుకే

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మే 7: ప్రజల భూములను కాజేసేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను జగన్‌రెడ్డి తీసుకొచ్చారని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు బీజేపీ పాలిత రాష్ట్రాలతో సహా ఏ రాష్ట్రంలోనూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేయలేదన్నారు. ప్రజల భూములను కబ్జా చేసేందుకే జగన్ రెడ్డి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చిందని తెలిపారు. ఇది అక్టోబరు 31 నుంచే అమలులోకి వచ్చినట్లు వైసీపీ ప్రభుత్వం జీవో నెం.512ను విడుదల చేసిందని అన్నారు. ఏపీ ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేసి దానికి చైర్‌పర్సన్, కమిషనర్ సభ్యులను నియమిస్తూ 2023 డిసెంబరు 29న ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి ఇంకా ఈ చట్టానిక మార్గదర్శకాలు ఇవ్వలేదంటూ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ల్యాండ్, సాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం కొల్లగొట్టడం ద్వారా రూ.8 లక్షల కోట్లు స్వాహా చేశారన్నారు. మన ఆస్తులకు మనం యజమానులుగా ఉండాలంటే.. వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించి, తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బజారు, అన్వర్‌బాషా, వేణు, కేవీ మధు, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తక్షణమే విరమించుకోవాలి

వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టైటిల్ రిజిస్ట్రేషన్, ల్యాండ్ అపిలేట్ అథారిటీల నియామక సూత్రాలు, వివాదాల రిజిస్ట్రేషన్ నిర్వహణ, యాజమాన్య హక్కుల వివాదాల పరిష్కారంలో సివిల్ కోర్టు పాత్రను పూర్తిగా ఈ యాక్ట్ తొలగించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి అబ్దుల్లా, శ్రీరాములు, అల్లాబాబు, నాగరాజు పాల్గొన్నారు.

న్యాయ రాజధానిని చూపించాకే అడుగుపెట్టు

- పశ్చిమ ప్రాంతం తాగు నీటికి అలమటిస్తోంది
- భూముల ఒరిజనల్ డాక్యుమెంట్స్ జగన్ వద్దే..
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), మే 7: న్యాయ రాజధానిని చూపించాకే సీఎం జగన్మోహన్‌రెడ్డి కర్నూలులో అడుగుపెట్టాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలూరులో జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఎస్ఐ పోలింగ్ కేంద్రంలోకి చొరబడి అధికారులను భయభ్రాంతులకు గురి చేశారని అన్నారు. ఈ విషయం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. భూరక్షణ చట్టంతో ఒరిజనల్ డాక్యుమెంట్స్ ప్రభుత్వం వద్దే ఉంచుకుని జిరాక్స్ పేపర్లు ప్రజలకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మరోసారి వైసీపీకి అధికారం ఇస్తే మన ఆస్తులన్నీ తాకట్టు పెడతారని హెచ్చరించారు. రాష్ట్రంలో యువత ఉపాధి అవకాశాలు లేక వలస కూలీలుగా మారిపోయారని తెలిపారు. రైతు వ్యతిరేక విధానాల కారణంగా రైతులు అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పశ్చిమ ప్రాంతానికి అవసరమైన వేదవతి, గుండ్రేవుల, ఆర్డీఎస్, ఎల్లెల్సీ ముఖ్యమైన ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగూరు, కోడుమూరు ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఈ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో జగన్‌రెడ్డి ఎలాంటి అక్రమాలు చేయడానికైనా సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, ఎల్‌ప ప్రసాద్, కుంపటి కృష్ణ పాల్గొన్నారు.

రూ. 77 లక్షలపైగా సీజ్

రూ. 2 కోట్లకు పైగా మద్యం..

కర్నూలు(కలెక్టరేట్), మే 7: ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంటు టీమ్స్ చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.77,68,890 నగదు, రూ.2,46,20,856 విలువైన లిక్కర్, రూ.50,13,508 విలువైన ప్రిషియస్ మెటల్స్ (బంగారం, సిల్వర్), రూ.2,45,700 విలువగల చీరలు, టీషర్టులు, టోపీలు తదితర వస్తువులు సీజ్ చేశారు. వీటి విలువ రూ.3,76,48,954 ఉంటుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన తెలిపారు. కమాండ్ కంట్రోల్ కమ్యూనికేషన్ సెంటరు ఆధ్వర్యంలో వివిధ మాధ్యమాల ద్వారా మొత్తం రూ.5వేల ఫిర్యాదులు అందాయని తెలిపారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.3

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

కర్నూలు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆదోని				
2. ఆలూరు				
3. పత్తికొండ				
4. కోడుమూరు (ఎస్సీ)				
5. ఎమ్మిగనూరు				
6. కర్నూలు				
7. మంత్రాలయం				
8. ఆళ్ళగడ్డ				
9. బనగానపల్లె				
10. డోన్				
11. శ్రీశైలం				
12. నందికొట్కూరు (ఎస్సీ)				
13. నంద్యాల				
14. పాణ్యం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయము : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం : 1/1 & 1/2, ఇండస్ స్కూల్ దగ్గర, గుత్తి రోడ్డు, పందిపాడు గ్రామ పంచాయితి, కల్లూరు (మం.), కర్నూలు -518002.

డోన్, మే 7:

ఆర్థిక మంత్రి బుగ్గన అండతో మైనింగ్ మాఫియా చేసిన దోపిడీ అంతా ఇంతా కాదు. డోన్ నియోజకవర్గంలో ఖనిజ వనరులను మంత్రి బంధువులు ఇష్టారాజ్యంగా కొల్లగొట్టారు. అధికార వైసీపీ నేతలు కొందరు కాసుల దాహంతో కొండలను మింగేశారు. విచ్చలవిడిగా గనుల్లో ఖనిజాలను దోచేస్తూ భారీగా సొమ్ము చేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇతరులు మైనింగ్ చేసుకోవాలంటే మంత్రి బంధువులకు వాటాలు ఇవ్వాల్సిందే. పౌడర్ ఫ్యాక్టరీలను తమ గుప్పిట్లో ఉంచుకుని కొందరు మంత్రి బంధువులు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఇలా ఈ ఐదేళ్లలో మంత్రి బంధువులు రూ.కోట్లు ఆర్జించినట్లు తెలుస్తోంది. డోన్, ప్యాపిలి ప్రాంతాల్లో డోలమైట్, లైమ్ స్టోన్, వైట్‌సేల్ తదితర ఖనిజ సంపద పుష్కలంగా ఉంది. దీంతో మంత్రి నియోజకవర్గంలో మైనింగ్ వ్యవహారాలు చూసేందుకు ఇద్దరు బంధువులకు అన్ని అధికారాలు కల్పించారు. వారు భారీ ఎత్తున మైనింగ్ దందాలు కొనసాగించారనే విమర్శలు ఉన్నాయి.

కొండలను మింగేశారు..!


బావిపల్లి దగ్గర మైనింగ్ గనులు

- మంత్రి బుగ్గన అండతో విచ్చలవిడిగా గనుల దోపిడీ
- మైనింగ్ చేసుకోవాలంటే ఆయనకు వాటాలు ఇవ్వాల్సిందే..
- పౌడర్ ఫ్యాక్టరీల నుంచి రూ.లక్షల వసూళ్లు
- చెక్‌పోస్టుల్లోనూ కొందరు వైసీపీ నాయకుల దందాలు

డోన్ ప్రాంతంలోని కొచ్చెర్వు, కనపకుంట్ల, కమలాపురం, చిన్నమల్కాపురం, వలసల తదితర గ్రామాల పరిధిలో డోలమైట్, లైమ్‌స్టోన్, వైట్‌సేల్ మైనింగ్ గనులు ఉన్నాయి. భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతులు ఉంటేనే గనుల్లో ఖనిజాలను బయటకు తీయాలి. అయితే.. మంత్రి బుగ్గన బంధువులు కొందరు మైనింగ్ గనులపై కన్నేశారు. కొచ్చెర్వు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకున్నా కొండలను తవ్వేశారు. అక్రమ మైనింగ్‌తో లక్షల టన్నుల ఖనిజాలను ఎక్స్‌కవేటర్లతో బయటకు తీసినట్లు విమర్శలు ఉన్నాయి. గనుల్లో అక్రమ తవ్వకాలతో భారీగా సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. వలసల, చిన్న మల్కాపురం ప్రాంతాల్లో మైనింగ్ గనుల్లో ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలతో ఖనిజ సంపదను కొల్లగొట్టారన్న ఇక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు.



మంత్రి బంధువుల దెబ్బకు పెద్ద పెద్ద కొండలు కరిగిపోయాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్యాపిలి మండలంలోని బావిపల్లి ప్రాంతంలో 200 ఎకరాల్లో మైనింగ్ గనులు ఉన్నాయి. డోలమైట్ ఖనిజం అధికంగా లభిస్తోంది. దీంతో మంత్రి అండదండలతో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు గనులపై వాలిపోయారు. అక్రమ తవ్వకాలతో గనులను దోచేశారన్న ప్రచారం జరుగుతోంది. అక్రమ తవ్వకాలతో ప్రతిరోజూ వేల టన్నుల ఖనిజాన్ని బయటకు తరలిస్తున్న ఏడీఎంజీ అధికారులు అటువైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు. మంత్రి బంధువులు, అనుచరులు గనులను మింగేస్తున్నా.. సంబంధిత అధికార యంత్రాంగం మామూళ్లు దండుకుని కిమ్మనకుండా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

● మంత్రి బంధువులకు వాటాలిస్తేనే..

డోన్ ప్రాంతంలో మైనింగ్ చేసుకోవాలంటే మంత్రి బుగ్గన బంధువులకు వాటాలు ఇవ్వాల్సిందే. కొచ్చెర్వు, కనపకుంట, కమలాపురం, చిన్నమల్కాపురం, వలసల తదితర గ్రామాల పరిధిలో వివిధ రకాల మైనింగ్ లీజు గనులు ఉన్నాయి. ఈ గనుల్లో ఖనిజాలను బయటకు తీసి అమ్ముకోవాలంటే.. మంత్రి బంధువుల అనుగ్రహం కావాల్సిందే. ప్రతి మైనింగ్ గనిలోనూ తప్పనిసరిగా మంత్రి బంధువులు ఇద్దరికి వాటాలు ఇవ్వాల్సిందే. కొన్ని మైనింగ్ గనుల్లో 30 శాతం, మరి కొన్ని మైనింగ్ గనుల్లో 40 శాతం వరకు వాటాలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. మంత్రి బంధువులకు వాటాలు ఇవ్వకపోతే మైనింగ్ గనుల్లో ఖనిజాలను బయటకు తీయలేని పరిస్థితి ఉంది. పట్టణానికి చెందిన ఓ మైనింగ్ వ్యాపారికి కొచ్చెర్వు ప్రాంతంలో ఉన్న మైనింగ్ గనిని మంత్రి బంధువులే గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. అడ్డగోలుగా ఆ మైనింగ్ గనిలో ఖనిజ తవ్వకాలను జరిపినట్లు విమర్శలున్నాయి. దీంతో చేసేదేమీ లేక మైనింగ్ వ్యాపారులు గనుల్లో వాటాలు తీసుకున్నట్లు తెలిసింది.


డోన్ సమీపంలోని పౌడర్ ఫ్యాక్టరీ

వైసీపీ నేతల గుప్పిట్లో పౌడర్ ఫ్యాక్టరీలు

డోన్ సమీపంలో పౌడర్ ఫ్యాక్టరీలు 70కి పైగానే ఉన్నాయి. ఇక్కడి పౌడర్ ఫ్యాక్టరీల నుంచే తయారయ్యే దానా కర్ణాటక రాష్ట్రంతో పాటు ఉభయగోదావరి జిల్లాలోని ఫిషరీస్ ఇండస్ట్రీస్‌కు పెద్ద ఎత్తున సరఫరా అవుతోంది. అదేవిధంగా ఇక్కడ తయారయ్యే వివిధ రకాల పౌడర్లు కర్ణాటక, మహారాష్ట్ర, చెన్నై రాష్ట్రాల్లోని సోప్, కెమికల్స్, క్వార్ట్జ్ ఇండస్ట్రీస్‌కు రవాణా చేస్తున్నారు. దీంతో పౌడర్ ఫ్యాక్టరీలోనూ మంత్రికి సంబంధించిన బంధువులు తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నారన్న విమర్శలున్నాయి. ఆ ఇద్దరు నేతల అనుమతులు ఉంటేనే పౌడర్ ఫ్యాక్టరీలకు ముడిసరుకు ఖనిజాలు సరఫరా అవుతాయి. లేదంటే పౌడర్ ఫ్యాక్టరీలకు ముడిసరుకు ఖనిజాలు అందవు. దీంతో పౌడర్ ఫ్యాక్టరీలకు సరఫరా చేసే ఖనిజాల్లో ఆ ఇద్దరు నేతల కనుసన్నల్లోనే ముడి ఖనిజాలను సరఫరా చేస్తూ వచ్చారు. ఇందులో భారీగా సొమ్ము చేసుకున్నట్లు విమర్శలున్నాయి. అంతేగాక పౌడర్ ఫ్యాక్టరీలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేయడం, జరిమానాలు విధించడం తరచూ జరుగుతూ వచ్చింది. ఒక్కో పౌడర్ ఫ్యాక్టరీకి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించిన సందర్భాలు ఉన్నాయి. విజిలెన్స్ అధికారులు దాడులు చేసినా మంత్రి బంధువులిద్దరికీ కాసుల పంట పండినట్లే. పౌడర్ ఫ్యాక్టరీలపై విధించిన జరిమానాలను లేకుండా చేస్తామని యజమానుల నుంచి రూ.లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

● వైసీపీ సేవలో ఏడీఎంజీ అధికారులు

ఏడీఎంజీ, విజిలెన్స్ అధికారులు వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఆర్థిక మంత్రి బుగ్గన సేవలో తరించారు. డోన్ నియోజకవర్గంలో మంత్రి బంధువుల కనుసన్నల్లో ఏడీఎంజీ, విజిలెన్స్ అధికారులు పని చేశారన్న విమర్శలు ఉన్నాయి. టీడీపీ నాయకులకు సంబంధించిన మైనింగ్ గనులను టార్గెట్ చేసి ఏడీఎంజీ, విజిలెన్స్ అధికారులు దాడులు చేయడం సర్వసాధారణమైపోయింది. డోన్ ప్రాంతంలో టీడీపీలో కీలకంగా ఉన్న ముఖ్య నాయకుల గనులపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.కోట్లల్లో జరిమానాలు విధించారు. ప్యాపిలి మండలంలోనూ టీడీపీ నాయకులకు సంబంధించిన పలు మైనింగ్ గనులపై దాడులు నిర్వహించి జరిమానాలు విధించారు. బేతంచెర్ల మండలంలో టీడీపీ నాయకుల మైనింగ్ గనులపై దాడులు నిర్వహించి రూ.కోట్లలో జరిమానాలు విధించారు. ఇదంతా కూడా మంత్రి సేవలో తరిస్తూ టీడీపీ నాయకులే లక్ష్యంగా ఐదేళ్ల పాటు దాడులు కొనసాగించారన్న విమర్శలున్నాయి. మంత్రి బంధువులు, అనుచరులు డోన్ నియోజకవర్గంలో మైనింగ్ గనుల్లో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు చేస్తున్నా ఏడీఎంజీ, విజిలెన్స్ అధికారులు ఏరోజు దాడులు చేసిన దాఖలాలు లేవు. ఏడీఎంజీ, విజిలెన్స్ అధికారుల తీరుతో డోన్ నియోజకవర్గంలో పలువురు టీడీపీ నాయకులు మైనింగ్ గనులను మూసివేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. రాయల్టీల జారీలోనూ ఏడీఎంజీ అధికారులు వైసీపీ నేతల కనుసన్నల్లోనే పని చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో కొందరు వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున లాబీన్ నడిపి రాయల్టీల జారీలో ఏడీఎంజీ అధికారుల ద్వారా రూ.లక్షలు ఆర్జించినట్లు ఆరోపణలున్నాయి.

● చెక్‌పోస్టుల్లోనూ దందాలు

మైనింగ్ ఖనిజాల అక్రమ రవాణాను అరికట్టేందుకు డోన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లోనూ వైసీపీ నేతల దందాలు కొనసాగాయి. వివిధ రకాల ఖనిజాలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నాయి. రవాణా చేసే ఖనిజాలకు రాయల్టీలు ఉన్నాయా లేదా అనేది చెక్‌పోస్టుల్లో తనిఖీ చేసి వాహనాలను పంపాల్సి ఉంటుంది. దీంతో చెక్‌పోస్టుల్లోనూ వైసీపీలో కీలకంగా ఉన్న ఇద్దరు నేతలు వసూళ్లకు పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. భూగర్భ శాఖ అధికారులు సైతం ఆ ఇద్దరి నేతల కనుసన్నల్లో పని చేసినట్లు ఆరోపణలున్నాయి. దీంతో మైనింగ్ గనుల యజమానులు ఖనిజాలను చెక్‌పోస్టులు దాటి వెళ్లేందుకు పెద్దఎత్తున సమర్పించినట్లు తెలిసింది. ప్రతి నెలా ఒక్కో మైనింగ్ యజమాని రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు ఇద్దరు వైసీపీ నేతలకు

పౌడర్ ఫ్యాక్టరీ



ముట్టజెప్పాల్సి ఉండేదన్న ఆరోపణలున్నాయి. ఇలా అధికారం అండతో చెక్‌పోస్టుల్లో ప్రతి నెలా రూ.లక్షలు వసూళ్లు చేసినట్లు మైనింగ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

మీ బాగోగుల బాధ్యత నాదే..



కర్నూలు(అర్బన్), మే 7: కర్నూలు టీడీపీ అభ్యర్థి వినూత్న రీతుల్లో ప్రచారం సాగిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఇందులోభాగంగా మంగళవారం 44వ వార్డు రామలింగేశ్వరనగర్, వెంకటరమణ కాలనీ ప్రాంతాల్లో టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఓ ఇంటి వద్ద వెళ్లిన ఆయన చిన్నారిని ఎత్తుకొని ముద్దాడారు. టీడీపీని గెలిపిస్తే ప్రజల బాగోగులను చూసుకుంటామని చెప్పారు.

తండ్రి ఫొటోతో తనయుడి ప్రచారం



ఎమ్మిగనూరు, మే 7: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి తన తండ్రి దివంగత నేత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి ఫొటోతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంతోపాటు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో తన తండ్రి బీవీ మోహన్‌రెడ్డి ఫొటోను ముందుపెట్టుకొని ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. దీంతో టీడీపీ శ్రేణులతోపాటు ప్రజలు గతంలో బీవీ చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకుంటున్నారు. బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎమ్మిగనూరు నుంచి మూడో పర్యాయం టీడీపీ తరపున బరిలో నిలిచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తన తండ్రి ఫొటోతోనే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండడం గమనార్హం.

ప్రచారం నిర్వహిస్తున్న బీవీ



ఓటరు స్లిప్ అందలేదా.. ?

● పలు విధాలుగా ఓటరు స్లిప్ పొందవచ్చు ● బీఎల్‌వోల వద్ద ఓటర్ల వివరాలు

శిరివెళ్ల, మే 7 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న రాష్ట్రంలోని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ఓటర్లకు ఓటరు స్లిప్‌లు(పోల్ స్లిప్పులు) పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు స్లిప్పులను అందించడానికి బూత్ లెవెల్ అధికారులకు(బీఎల్‌వో) బాధ్యతలు అప్పగించారు. కానీ ఇప్పటికీ చాలా చోట్ల ఓటరు స్లిప్పులు అందడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓటరు స్లిప్పులు అందకపోతే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

ఫోన్ ద్వారా సులువుగా..

ఎన్నికల సిబ్బంది నుంచి పోలింగ్ స్లిప్పులు అందకపోతే ఆన్‌లైన్, మొబైల్ యాప్, హెల్ప్‌లైన్ నంబర్‌తోపాటు మొబైల్ ఎస్ఎంఎస్ ద్వారా పొందేందుకు ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. ఓటరు గుర్తింపు కార్డు నెంబర్‌ను టైప్ చేసి 1950 లేదా 9211728082 అనే నెంబర్లకు ఎస్ఎంఎస్ పంపితే వివరాలు వస్తాయి. ఎలాంటి రుసుము లేకుండానే ఈ నెంబరుకు పంపిన వివరాలను సరిపోల్చుకుని ఎన్నికల సంఘం తగిన సమాచారాన్ని పంపుతుంది.

టోల్-ఫ్రీ నెంబర్ ద్వారా.. :

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 24 గంటలూ పని చేసే హెల్ప్‌లైన్(టోల్-ఫ్రీ) నెంబర్ 1950కు ఫోన్ చేసి ఓటర్ల వివరాలను లేదా ఓటరు గుర్తింపు కార్డు నెంబర్‌ను తెలియజేయడం ద్వారా కూడా పోలింగ్ కేంద్రం, బూత్ నెంబర్ తదితర వివరాలను పొందవచ్చు.

ఆన్‌లైన్ ద్వారా.. :

సీఈవోఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఓటర్స్ అనే మెనూలో సెర్చ్



యువర్ నేమ్ ఇన్ ఓటర్స్ లిస్ట్, నో యువర్ పోలింగ్ బూత్ అనే ఆప్షన్ల ద్వారా వివరాలను ఇచ్చి సమాచారం తెలుసుకోవచ్చు. ఇందులో ఆ ఓటరు సంబంధిత బీఎల్‌వో పేరు, ఫోన్ నెంబర్‌తోపాటు బూత్ నెంబర్, చిరునామా కూడా తెలుసుకోవచ్చు.

ఈ-మెయిల్ ద్వారా.. :

ఎన్నికల సంఘానికి ఈ-మెయిల్(కంప్లెయింట్స్‌రేటాఫ్‌ఈసీఐ.గవర్నమెంట్.ఇన్)కు ఫిర్యాదు(గ్రీవెన్స్) చేయడం ద్వారా పోలింగ్ బూత్ వివరాలను తిరిగి మెయిల్ ద్వారా పొందవచ్చు.

మొబైల్ యాప్‌తో.. :

ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్లు గూగుల్ ప్లేస్టోర్ నుంచి, ఐఓఎస్ వినియోగదారులు యాప్ స్టోర్ నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ అనే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు ఇవ్వడం ద్వారా ఏ పోలింగ్ బూత్‌లో ఓటు వేయాలో తెలుసుకోవచ్చు.

రెండో రోజు 2,374 మంది..

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకున్న ఉద్యోగులు

కర్నూలు(న్యూసిటీ), మే 6: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ రెండో రోజు ప్రారంభమైంది. కర్నూలు అసెంబ్లీ పరిధిలో 3,410 మంది ఉండగా, సోమవారం 79 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మొత్తం 3,489 మంది అయ్యారు. ఇందులో ఇతర జిల్లాల ఓటర్లు 1103 ఉన్నారు. వీరిలో కర్నూలు అసెంబ్లీ నుంచి స్థానికులు 2,374 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు 502 మంది తమ పోస్టల్ బ్యాలెట్‌ను వేసినట్లు అధికారులు తెలిపారు. ఓటింగ్ తీరును కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే విశ్వేశ్వరరెడ్డి పరిశీలించారు.


ఆదోనిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎంపీఐ దీప్తి

జగన్ వచ్చాక పింఛన్ పోయింది..!


నందవరంలో టీడీపీ నాయకులకు మొరపెట్టుకుంటున్న వృద్ధురాలు

జగన్ అధికారంలోకి వచ్చాక తన పింఛన్ కట్ చేశాడని నందవరానికి చెందిన వేదాత్తమ్మ అనే 90 ఏళ్ల వృద్ధురాలు మంగళవారం ప్రచారానికి వచ్చిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు ముందు మొర పెట్టుకుంది. మళ్లీ టీడీపీ రావాలని, అప్పుడే అర్హులైన అందరికీ పింఛన్ వస్తుందని వృద్ధురాలు పేర్కొనడం గమనార్హం. చంద్రబాబు వస్తాడని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని దేశాయి చెపుతూ ఇంటింటా ప్రచారం చేశారు. -నందవరం

మహిళలతో ఓ సెల్ఫీ



శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి మంగళవారం వెలుగోడు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా బండిఆత్మకూరు మండల కేంద్రంలో మహిళలతో కలిసి సెల్ఫీ దిగారు. అనంతరం టీడీపీని గెలిపించాలని కోరారు. -వెలుగోడు

మా నాన్నను గెలిపించండి



శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గెలిపించాలని కోరుతూ.. ఆయన కుమార్తె డాక్టర్ బుడ్డా మేఘన మంగళవారం ప్రచారం చేపట్టారు. ఆత్మకూరు పట్టణంలోని 6వ వార్డులో ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ గెలిస్తే భవిష్యత్తు బాగుంటుందని తెలియజేశారు. -ఆత్మకూరు

వైసీపీ ఓటమి తథ్యం



సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యమని బనగానపల్లె అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి కోడలు బీసీ క్షీరారెడ్డి, కుమార్తెలు మనోరమారెడ్డి, బీసీ మాధవి అన్నారు. మంగళవారం ప్రజాగళంలో పాల్గొనేందుకు చెన్నంపల్లె గ్రామానికి చేరుకున్న బీసీ కుటుంబ సభ్యులకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. - అవుకు



ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కర్నూలు నగరంలో టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ బజ్జీలు వేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు.

బనగానపల్లె నియోజకవర్గం సంజామల మండలంలోని పేరుసోమలలో టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించేందుకు మిద్దెలపైకి ఎక్కిన ప్రజలు





నగరంలోని జీ.క్యాంపు ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెలిసిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి - కర్నూలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల సారథులు



ఓటు హక్కు వినియోగించుకున్న అక్కాచెల్లెళ్లు



కర్నూలు(న్యూసిటీ), మే 7: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల విధుల్లోని ఉద్యోగుల్లో ముగ్గురు అక్కా చెల్లెళ్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముగ్గురు సొంత అక్కా చెల్లెళ్లు ఒకే రోజు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవడం కొసమెరుపు. ఇందులో ఒకరు పంచాయతీరాజ్ శాఖ, మరొకరు టీచర్, ఇంకొకరు సచివాలయ ఉద్యోగి కావడం గమనార్హం. మరొకరు కూడా పాణ్యం అసెంబ్లీ పరిధిలో ఓటు హక్కు వినియోగించుకున్నట్లు వారు తెలిపారు.


ఓట్లంటే ఇంత హడావుడి ఉండేది కాదు



ఓట్లు వచ్చాయంటే అప్పట్లో ఇంత హడావుడి ఉండేది కాదు. ఇంత పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేసిన దాఖలాలు ఎప్పుడూ లేవు. ప్రస్తుతం డబ్బులిచ్చి ఓట్లు కొనుక్కుంటున్న నేతలు, గెలిచిన తరువాత డబ్బు సంపాదనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పరిస్థితి మారాలి. రాష్ట్రాన్ని, గ్రామాలను అభివృద్ధి చేసే నాయకులకే ఓట్లు వేయాలి. అటువంటి వారికే నా ఓటు.

బెలుం బాలయ్య (సీనియర్ ఓటరు)

టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించిన భూముల్లో జగన్ రియల్ వ్యాపారం



చేనేతల ద్రోహి జగన్

టెక్స్‌టైల్ పార్కు.. ఎమ్మిగనూరు చేనేత కార్మికుల చిరకాల స్వప్నం. మరమగ్గాల పోటీ తట్టుకోలేక చేనేత కార్మికులు చేతి మగ్గాలు వదలేస్తున్నారు. వీవింగ్, గార్మెంట్.. వంటి పరిశ్రమలు తీసుకొచ్చి చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా గత టీడీపీ ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కుకు ఏర్పాటు చేయాలనుకుంది. బనవాసి పశు క్షేత్రంలో వంద ఎకరాలకు కేటాయించారు. మౌలిక వసతుల కల్పన కోసం రూ.10 కోట్లతో ప్రతిపాదినలు సిద్ధం చేశారు. ఇదంతా సరిగ్గా ఎన్నికలు రాబోతుండగా చేయడంతో టీడీపీ స్వప్నం ఫలించలేదు. ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడం టెక్స్‌టైల్ పార్కుకు శాపంగా మారింది. ఈ పార్కుకు కేటాయించిన భూములను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. జగనన్న స్మార్ట్ సిటీ పేరిట 'కుడా' రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీసింది. ఇది చేనేతలకు ద్రోహం చేయడమే అని చేనేత కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ప్రశ్నిస్తున్నారు.

- టెక్స్‌టైల్ పార్కుపట్ల నిర్లక్ష్యం
- పార్క్‌కు కేటాయించిన భూములు రద్దు
- 'కుడా' రియల్ వ్యాపారం
- టీడీపీ ప్రభుత్వం వస్తే పార్క్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ

జగనన్న స్మార్ట్ సిటీ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం:

జగన్ ప్రభుత్వం వచ్చాక టెక్స్‌టైల్స్ పార్కుకు కేటాయించిన భూములను రద్దు చేశారు. అక్కడే జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పేరిట 'కుడా' ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి శ్రీకారం చుట్టింది. 110 ఎకరాల్లో 1,097 ప్లాట్లు (3 సెంట్ల ప్లాట్లు 447, 4 సెంట్ల ప్లాట్లు 460, 5 సెంట్ల ప్లాట్లు 190) వేసింది, సెంటు రూ.2.75 లక్షలకు బేరం పెట్టింది. దాదాపుగా 10 వేల మంది చేనేత కార్మికులు, గార్మెంట్ వస్త్రాల ఉత్పత్తి చేసే టైలర్లకు ఉపాధి కల్పించాలనే టెక్స్‌టైల్ పార్కును అట కెక్కించి ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం విమర్శలకు గురైంది. తాజాగా యువగళం పాదయాత్రలో టీడీపీ యువనేత నారా లోకేశ్, తేరు బజారులో జరిగిన బాదుడే బాదుడు, ప్రజాగళం సభల్లో మాజీ సీఎం చంద్రబాబు టీడీపీ ప్రభుత్వం రాగానే టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మిగనూరు చేనేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే.. ఎమ్మిగనూరులో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో సీఎం జగన్ టెక్స్‌టైల్ పార్కు పేరు కూడా ఉచ్చరించలేదు. ఇది చేనేత కార్మికులపై వైసీపీ నాయకులకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని చేనేత కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.



కర్నూలు, మే 7 (ఆంధ్రజ్యోతి):

ఎమ్మిగనూరు అంటేనే చేనేత వస్త్రాల ఉత్పత్తికి పెట్టింది పేరు. చీరలు, లుంగీలు, టవల్స్, దోమ తెరలు.. వంటి నూలు వస్త్రాలు మగ్గాలపై నేసేవారు. స్వాతంత్ర్యానికి పూర్వమే దివంగత పద్మశ్రీ మాచాని సోమప్ప ఎమ్మిగనూరు చేనేత పరస్పర సహకార సంఘం (ది ఎమ్మిగనూరు వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ) ఏర్పాటు చేసి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చారు. టెక్స్‌టైల్ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు రావడం, మరమగ్గాలు పెరగడంతో చేనేతల వస్త్రాలకు డిమాండ్ తగ్గుతూ వచ్చింది. ఫలితంగా చేనేత మగ్గాలనే నమ్ముకున్న వారికి ఉపాధి కరువు అయ్యింది. ఎమ్మిగనూరు, నందవరం, నాగులదిన్నె, గుడేకల్లు, గోనేగండ్ల, కోడుమూరు, ఆదోని ప్రాంతాల్లో చేనేతలు అధికంగా ఉన్నారు. గద్వాల పట్టు చీరలు నేసే జాకాటీ మగ్గాలు వచ్చినా ఆశించిన స్థాయిలో ఉపాధి చూప లేదు. ఈ పరిస్థితుల్లో చేనేతలకు ఉపాధి కల్పించాలంటే టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు ఎంతో ఆశవ్యకత ఉందని 2003లో ఆనాటి మంత్రి బీవీ మోహన్‌రెడ్డి గుర్తించారు.





టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి వేసిన శిలాఫలకం (ఫైల్)

టీడీపీ ప్రభుత్వంలో టెక్స్‌టైల్ పార్కుకు వంద ఎకరాలు

బనవాసి పశు క్షేత్రంలో అపెరల్ ఎక్స్‌పోర్ట్ పార్కు (టెక్స్‌టైల్ పార్కు) ఏర్పాటుకు 2004 ఫిబ్రవరి 15న అప్పటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే, మంత్రి బీవీ మోహన్ రెడ్డి శంకుస్థాన చేసి శిలాఫలకం వేశారు. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టెక్స్‌టైల్ పార్కును అటకెక్కించింది. ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కూడా పట్టించుకోకపోవడంతో చేనేతల స్వప్నమైన టెక్స్‌టైల్ పార్కు కనుమరుగైంది. పదేళ్ల తరువాత 2014లో బీవీ మోహన్‌రెడ్డి తనయుడు బీవీ జయనాగేశ్వరెడ్డి ఎమ్మెల్యేగా గెలవడంతో మళ్లీ టెక్స్‌టైల్ పార్కుకు జీవం వచ్చింది. ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి.. ఆనాటి సీఎం చంద్రబాబును ఒప్పించి బనవాసి పశు కేత్రంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు వంద ఎకరాలు భూమి కేటాయించేలా చేశారు. పశు సంవర్థక శాఖ నుంచి ఏపీ జౌళి, టెక్స్‌టైల్ శాఖకు ఆ భూమిని బదలాయిస్తూ ప్రత్యేక జీవో ఇచ్చారు. అంతేకాదు.. రోడ్లు, నీరు, విద్యుత్.. వంటి మౌలిక వసతుల కోసం రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అదే క్రమంలో ఇక్కడ వీవింగ్, గార్మెంట్, రెడీమేడ్ దుస్తుల తయారు చేసేందుకు గుజరాత్, మహారాష్ట్ర, బెంగళూరు.. వంటి ప్రాంతాల్లోని ప్రముఖ కంపెనీలతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పలుమార్లు సంప్రదించారు. వారు కూడా సానుకూలత వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి ఎంఓయూ చేసుకోవాల్సిన కీలక సమయంలో ఎన్నికలు వచ్చి టీడీపీ ప్రభుత్వం పడిపోయింది. వైసీపీ ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కును పట్టించుకోలేదు.

వయోవృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్



హోం ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 7: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హోం ఓటింగ్ ప్రక్రియ ద్వారా జిల్లాలో ఉన్న వయోవృద్ధులు, దివ్యాంగులకు ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. మంగళవారం హోం ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, పీడబ్ల్యూడీ ఓటర్లు ఇంటి వద్దనే ఓటు వేస్తామని దరఖాస్తు చేసుకున్న వారికి హోం ఓటింగ్ విధానం ద్వారా ఓటు హక్కు కల్పించామన్నారు. కర్నూలు మండలం, ఉల్చాల గ్రామంలో కుమ్మరి వెంగమ్మ (87) సంవత్సరాల వృద్ధ మహిళకు, కల్లూరు మండలం లక్ష్మీ టౌన్‌షిప్‌లో ఉన్న మల్లికార్జునరావు (86) అనే వయోవృద్ధుడికి హోం ఓటింగ్ విధానం ద్వారా ఓటు హక్కు అవకాశం కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, కోడుమూరు ఆర్వో శేషిరెడ్డి, కల్లూరు తహసీల్దార్ మునివేలు పాల్గొన్నారు.

40 ప్రత్యేక పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు



కర్నూలు (కలెక్టరేట్), మే 7: సాధారణ ఎన్నికల నేపథ్యంలో 40 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన మంగళవారం తెలిపారు. జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కర్నూలు-1, పత్తికొండ-5, కోడుమూరు-4, ఎమ్మిగనూరు-3, మంత్రాలయం-4, ఆదోని-1, ఆలూరు-6, పాణ్యం-4 కలిపి మొత్తం 28 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా మహిళా పోలింగ్ సిబ్బందితో నిర్వహించేలా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున 8 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లాలో 28 మోడల్ పోలింగ్ స్టేషన్లు, మహిళల నిర్వహణలో ఎనిమిది పోలింగ్ స్టేషన్లు, యువత నిర్వహణలో రెండు పోలింగ్ స్టేషన్లు, వికలాంగుల నిర్వహణలో రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

- 137- కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం - కేవీఆర్ డిగ్రీ కళాశాల, పోలింగ్‌స్టేషన్ నెంబర్.33, రూమ్.నెం.14 (వెస్ట్ వింగ్), నరసింహారెడ్డి నగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, కర్నూలు.
- 138- పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం - పోలింగ్ స్టేషన్ నెం.88, మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్, 6వ తరగతి బాలికల గది, ఇందిరాగాంధీ కాలనీ, బీసీ కాలనీ, కల్లూరు.
- 142- పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గం - పోలింగ్ స్టేషన్ నెం.216, గ్రామ పంచాయతీ కార్యాలయం, వెల్దుర్తి గ్రామం, మండలం
- 143- కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం - పోలింగ్ స్టేషన్ నెం.111, కేశవరెడ్డి ఇంగ్లీషు స్కూల్, నర్సరీ-ఎ, న్యూపోస్టల్ కాలనీ, స్టాంటన్‌పురం, హెచ్/ఓ మామిదాలపాడు, కర్నూలు రూరల్ మండలం
- 144- ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గం- పోలింగ్ స్టేషన్.నెం.174, 1వ తరగతి గది, ఎంపీపీ పాఠశాల, బనవాసి ఫార్మ్, ఎమ్మిగనూరు మండలం
- 145- మంత్రాలయం అసెంబ్లీ నియోజకవర్గం- పోలింగ్ స్టేషన్ నెం.72, జడ్పీ ఉన్నత పాఠశాల, కొత్త భవనంలోని సిబ్బంది గది, మంత్రాలయం
- 146- ఆదోని అసెంబ్లీ నియోజకవర్గం- పోలింగ్ స్టేషన్ నెం.250, జీఎంసీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల (తూర్పు విభాగం), ఆదోని
- 147- ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గం - పోలింగ్ స్టేషన్ నెం.127, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఆలూరు మండలం

యువ పోలింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా కర్నూలులో-1, ఆదోనిలో 1, కలిపి మొత్తం రెండు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

- 137-కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం- పోలింగ్ స్టేషన్ నెం 107, మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్, నర్సరీ బ్లాక్, రూమ్ నెం.5, ఎ.క్యాంపు, కర్నూలు.
- 146- ఆదోని అసెంబ్లీ నియోజకవర్గం- పోలింగ్ స్టేషన్.నెం.255, సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ ఇంగ్లీషు మీడియం స్కూల్, (1వ తరగతి గది), ఆదోని.
- వికలాంగులైన పోలింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో-2 ప్రత్యేకమైన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.
- 137-కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం- కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, పోలింగ్ స్టేషన్ నెం.45, రూం.నెం.26, ఎస్‌ఏపీ క్యాంపు, కర్నూలు
- 137-కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం- ప్రభుత్వ జూనియర్ కళాశాల, టౌన్, పోలింగ్ స్టేషన్ నెం.153, రూమ్ నెం.9, జువాలజీ ల్యాబ్, కర్నూలు.



ఓటర్లకు ఉక్కపోత



- నాలుగు గంటలపాటు నిరీక్షించిన ఉద్యోగులు
- నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్

కర్నూలు(న్యూసిటీ), మే 7: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు వచ్చే ఉద్యోగులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎ.క్యాంపు ఇందిరాగాంధి మెమోరియల్ పాఠశాలలో రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ చేపట్టారు. ఓటు వేసే బూత్‌లలో సరైన గాలి లేకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం గాలి వచ్చేందుకు కూలర్‌కు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2, 4 రూమ్‌లలోనే ఈ పరిస్థితి ఉందని, ఇంకో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఓటర్లు కోరారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు భోజనానికి వెళ్లడంతో ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల భూములు కాజేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

గూడూరు, మే 7: ప్రజల భూములను కాజేసేందుకే జగన్‌రెడ్డి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చిందని టీడీపీ నాయకులు కురుకుంద రామాంజనేయులు, జె సురేష్, పౌలు, రేమట వెంకటేష్ అన్నారు. మంగళవారం గూడూరులో టీడీపీ శ్రేణులు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోకు వినతి పత్రం అందజేశాయి. నాయకులు రామాంజనేయులు, సురేష్, పౌలు, సురేష్, టీడీపీ కౌన్సిలర్లు బుడ్డంగలి, షాషావలి, తెలుగు శ్రీను, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కల్లూరు: రాష్ట్ర ప్రజల ఆస్తులకు రక్షణ కరువైందని, తక్షణమే భూయాజమాన్య హక్కు చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు డి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు.

టీడీపీ విజయం ఖాయం

గూడూరు, మే 7: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని టీడీపీ నాయకుడు, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు తెలుగు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం గూడూరులో టీడీపీ నాయకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్ళి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈసందర్భంగా తెలుగు శ్రీనివాసులు మాట్లాడుతూ కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పౌలు, గిడ్డయ్య, పుల్లయ్య, వెంకటరాముడు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు, మే 7: గ్రామాల్లో ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ అమర్నాథ్ రెడ్డి కూలీలకు సూచించారు. మంగళవారం మండలంలోని తిప్పాయపల్లె, శకునాల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజుల పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పనుల వద్ద కూలీలకు మౌలిక వసతులతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం శకునాల సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుమిత్రాదేవి, ఆశా వర్కర్లు ఈసీ వెంకట భూపాల్, టీఏ మధుశేఖర్, శ్రీకాంత్, షేక్షావలి, నాగార్జునగౌడు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 7: స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఉపాధ్యక్షుడు ఆది అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలకులపైన మెరుపు దాడులు చేసి ప్రజల పక్షాన పోరాటానికి నాంది పలికారని కొనియాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నగర అధ్యక్ష, కార్యదర్శులు రమణ, దామోదర్, మహేష్, ప్రసాద్, రమేష్, అరవిందు పాల్గొన్నారు.

● ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల ఎదుట ఉన్న మైదానంలో స్వతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌వో నాయకులు భార్గవ్, మల్లేష్, ఈరన్న, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఓర్వకల్లులో ఎన్నికల ప్రచారం

ఓర్వకల్లు, మే 7: మండలంలోని పూడిచెర్ల, కేతవరం కన్నమడకల, ఓర్వకల్లు గ్రామాల్లో బుధవారం పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత రోడ్ షో, సభ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

రాజధాని లేని రాష్ట్రానికి సీఎం జగన్

టీడీపీ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



చెన్నమ్మ సర్కిల్‌లో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

కల్లూరు, మే 7: రాజధాని లేని రాష్ట్రానికి సీఎం జగన్‌రెడ్డి అని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు చెన్నమ్మసర్కిల్లో ఆయన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మానసిక స్థితిపై అనుమానం ఉందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఇసుక దోచుకున్నాడని, నదులను అక్రమించాడని, రైతులను మోసం చేశాడని, తాగుబోతులను కూడా వదలకుండా మద్యంతో సంపాదిస్తున్నాడని ఆరోపించారు. అప్పులు చేసి చదువుకున్నా యువతకు ఉద్యోగాలు రావడం లేదన్నారు. సొంత తల్లి చెల్లిని ఇబ్బందులకు గురిచేసే జగన్ రాష్ట్ర ప్రజలపై ప్రేమెలా చూపగలరని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో మన భూములు కోల్పోవలసి వస్తుందని రైతులు అప్రమత్తంగా ఉండాలని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు.

యువతకు మంచి భవిష్యత్తు కల్పిస్తా

కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్



టీజీ భరత్‌తో మందక్రిష్ణ మాదిగ

కర్నూలు(అర్బన్), మే 7: ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గంలోకి పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్ కల్పిస్తానని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. మంగళవారం టీజీ భరత్ కార్యాలయంలో జోహ రాపురానికి చెందిన 70 మంది యువకులు టీడీపీ నాయకులు వైవీ రమణ, ఎంవీ నారాయణల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి టీజీ భరత్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం వైవీ రమణ, ఎంవీ నారాయణ మా ట్లాడుతూ టీజీ భరత్ ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని టీజీ భరత్ కోరారు.

ప్రజలకు కష్టం రాకుండా చూసుకుంటా: టీజీ

ఒక్కసారి తనకు ఓటు వేసి గెలిపిస్తే ఐదేళ్ల ప్రజలకు కష్టం రాకుండా చూసుకుంటానని కర్నూలు నియోజకవర్గం టీ డీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. మంగళవారం 44 వార్డు రామలింగేశ్వరనగర్, వెంకటరమణ కాలనీ ప్రాంతాల్లో టీజీ భరత్ భరోసాయాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి డమ్మీ ఈవీఎం మిషన్లు చూపించి ..ఎలా ఓటు వేయాలో ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పారిశ్రామిక వేత్తగా తనకు ఉన్న అనుభ వంతో కర్నూలుకు పరిశ్రమలు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లలో కర్నూలు రూపురేఖలు మార్చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, జనసేన నాయకులు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మాదిగలు టీజీ భరత్‌ను గెలిపించాలి

టీజీ భరత్‌తో మందక్రిష్ణ మాదిగ భేటీ

మాదిగలు టీజీ భరత్‌ను కర్నూలు ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ పిలుపు నిచ్చారు. మంగళవారం కర్నూలు నగరంలో నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌ను ఆయన కార్యాలయంలో కలి శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ స్థాయిలో విస్తరించేందుకు సంపూర్ణ సహకారం అందించిన టీజీ కుటుంబం రుణం తీర్చుకునే సమయం వచ్చిందన్నారు. ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని బలపరు స్తున్నదన్నారు. టీజీ వెంకటేష్ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన టీజీ భరత్‌ను గెలిపించేందుకు మాదిగలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలన్నారు.

టీడీపీ కూటమిదే అధికారం



నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గౌరు చరిత



గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరుతున్న లక్ష్మీపురం నాయకులు

కల్లూరు, మే 7: రాష్ట్రంలో టీడీపీ కూటమిదే అధికారమని, వైసీపీ ఓటమి ఖాయమని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరిత పిలుపునిచ్చారు. మంగళవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. టీడీపీ ప్రభంజనం ముందు వైసీపీ కొట్టుకుపోవడం తప్పదన్నారు. వివిధ కూలాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క రూపాయి నిధులు విడుదల చేయకుండా ఎస్సీ, ఎస్టీల భవిష్యత్తు ఇబ్బందుల్లోకి నెట్టాడన్నారు. టీడీపీ అధినేత ఇచ్చిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టోతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన అధ్యక్షుడు చింతాసురేష్, టీడీపీ అర్బన్ వార్డుల కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ ప్రభాకర్‌యాదవ్, జగదీశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: గౌరు జనార్దన్‌రెడ్డి

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 41వ వార్డు విష్ణుటౌన్‌షిప్, వసుంధర హోమ్స్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడని, చంద్రబాబుతోనే రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని హహేష్‌గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జి జనార్దన్ ఆచారి, ప్రసాద్ పాల్గొన్నారు.

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత

లక్ష్మీపురంలో వైసీపీకి షాక్

గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన 50 కుటుంబాలు

పాణ్యం నియోజకవర్గంలో అధికార వైసీపీకి షాక్ తగిలింది. కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురానికి చెందిన 50 కుటంబాలు మంగళవారం గౌరు దంపతుల సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో దేవదానం, అశోక్, సందీప్, రంగన్న, శేఖర్, సుధాకర్, రమేష్ సుధీర్, తేజ, సురేష్, కిరణ్, మధు, అంజి, రంగన్న, సుంకన్న, ప్రేమరాజు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ ఆకెపోగు వెంకట స్వామి, పుల్లారెడ్డి, మారెన్న, రామిరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

● ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు అయ్యస్వామి, అయ్యన్నతోపాటు 20 కుటంబాలు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మహేష్, ఈశ్వర్, వెంకటేష్, సురేంద్ర, పుల్లగుమ్మి సూరి, మధు, నాగరాజు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అయ్యస్వామి, బుడ్డ బాషా, రాజు, చందు పాల్గొన్నారు.

కోడుమూరు రూపురేఖలు మారుస్తాం: విష్ణు



గార్గేయపురంలో టీడీపీ రోడ్‌షోకు హాజరైన జనం

గార్గేయపురంలో భారీ రోడ్‌షో



కోడుమూరు మండలంలో ప్రచారం చేస్తున్న దస్తగిరి

కర్నూలు(రూరల్)మే7: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని గెలిపిస్తే కోడుమూరు నియోజకవర్గం రూపురేఖలు మారుస్తామని టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. శాశ్వత మంచి నీటి పథకం తో అన్ని ప్రాంతాలకు తాగునీటి సౌకర్యాలు కల్పిస్తామని ఆయన వివరించారు. కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన టీడీపీ రోడ్‌షోకు కర్నూలు టీడీపీ ఎంపీ, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థులు నాగరాజు, బొగ్గుల దస్తగిరితో కలిసి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇస్తే జీవితాంతం మీకు గుర్తుండే విధంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. బొగ్గుల దస్తగిరి, బస్తిపాటి నాగరాజు ఇద్దరు కర్నూలు రూరల్ మండలానికి చెందిన వారని అన్నారు. బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడేది చంద్రన్న ప్రభుత్వమేనని, ప్రతి ఒక్కరూ తనను ఆదరించాలని కోరారు. తనతోపాటు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజును గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ గార్గేయపురం గ్రామం అనేక మంది రాజకీయ ఎదుగుదలను అవకాశం ఇచ్చిందని, అదే కోవాలో తమను కూడా అక్కున చేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కౌలుట్ల య్య, షాదిక్‌బేగ్, భూపాల్‌రెడ్డి, రామోజీరావు, వాల్మీకి జమ్ములయ్య, సహార్‌బేగ్, పల్లె సీతారామిరెడ్డి, బైరెడ్డి రఘువర్దన్‌రెడ్డి, ఆర్ మోజెస్, సురేష్, శేఖర్, పింజరి అల్లీపీరా పాల్గొన్నారు.

వైసీపీకి నిరుద్యోగుల ఉసురు తగులుతుంది: దస్తగిరి

కోడుమూరు(రూరల్): గత ఎన్నికల్లో ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని మాయమాటలతో అధికారం చేపట్టిన జగన్‌కు నిరుద్యోగుల ఉసురు తగులుతుందని టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. మంగళవారం రాత్రి అనుగొండ, ఎర్రదొడ్డి, చిల్లబండ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తాగునీరు, పింఛన్లు, సీసీ రహదారులు, డ్రైనేజీ సమస్యలపై పలువురు గోడు విని పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఈ క్రిష్ణారెడ్డి, పట్టి క్రిష్ణ, ఉపసర్పంచ్ వెం కటేశ్వరమ్మ, చదువుల వెంకటేశ్వర్లు, రామలింగం, లింగేశ్వరయ్య, చంద్రబాబు నాయుడు, రామదాసు, సురేంద్ర, ఎర్రమల, దుబ్బన్న, నాగరాజు, చాకలి రాముడు, మాబాష, సుధాకర్ పాల్గొన్నారు.

టీడీపీ గూటికి ఎల్ఆర్కే : అనుగొండకు చెందిన లక్కిరెడ్డి రామక్రి ష్ణారెడ్డి తన అనుచరులతో తిరిగి టీడీపీ గూటికి చేరారు. మంగళవారం రాత్రి అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. కొన్నాళ్ల కిందట వైసీపీ సచివాలయ కన్వీనర్ పదవికి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. రెండు రోజుల క్రితం సొంతగూటికి వెళ్లారు.

రేపు జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), మే 7: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమా వేశాలు ఈనెల 9న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని సీసీఓ చాంబర్‌లో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారని తెలిపారు.

టీడీపీ విజయానికి ఇంటింటి ప్రచారాలు చేపట్టాలి

కర్నూలు(కల్చరల్), మే 7: జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి ఇంటింటి ప్రచారాలు చేపట్టాలని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ ఆనంద సూర్య అన్నారు. మంగళవారం కర్నూలులో బ్రాహ్మణ సమాఖ్య కార్యాలయంలో వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద సూర్య మాట్లాడుతూ బ్రాహ్మణుల కోసం ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. నాయకులు సందేల్ చంద్రశేఖర్, సీవీ దుర్గాప్రసాద్, టీవీ రవిచంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.నాగార్జునరావు



నియామక పత్రం అందజేస్తున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), మే 7: కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ కోసం పని చేస్తున్న జి.నాగార్జున రావు సేవలను గుర్తించి కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించామని జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఆయన ప్రస్తుతం ఎలాంటి పదవిలో లేని కారణంగా ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆయన సేవలను మరింతగా ఉపయోగించుకునేందుకు పదవీ కేటాయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర పాల్గొన్నారు.

కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగురవేస్తాం



కొండిగేరిలో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, మే 6: కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగరడం ఖాయ మని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, టీడీపీ యువ నేత రేమట వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని కొండిగేరి కాలనీలో టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకీ, కోడుమూరు షాషా వలి, మన్నన్ బాషా, విజయ్ కుమార్, విష్ణు సేన అభిమానులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పూర్తి చేయండి

కర్నూలు(కలెక్టరేట్), మే 7: పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను బుధవారంలోగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెకటర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పాణ్యం-138 నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వ బాలుర పాఠశాల, బీక్యాంపులో ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కోసం వచ్చే ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, షెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి ఉన్నారు.

ప్రజల ఆస్తులను కాజేసేందుకు జగన్ కుట్ర

టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు



ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి నాగరాజు కుటుంబ సభ్యులు

కర్నూలు(రూరల్)మే7: ఏపీలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ముసుగులో ప్రజల ఆస్తులను కాజేసేందుకు జగన్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని కర్నూలు పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు ఆరోపించారు. కర్నూలులో మంగళ వారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాటాడారు. జీవో నెం.512ను తీసుకొచ్చి మన భూములను ప్రమాదంలోకి పడేస్తున్నారన్నారు. ఒక్క సారి జీవో అమల్లోకి వస్తే మన ఆస్తులు జగన్‌రెడ్డి చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. అలా జరిగితే జగన్ అందరి ఆస్తులను తీసుకెళ్ళి ప్రపంచ బ్యాంక్‌లో తాకట్టు పెడతారని ఆరోపించారు. చంద్రబాబు ముఖ్య మంత్రి అయితే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును పూర్తిగా రద్దు చేస్తారని నాగ రాజు తెలిపారు.

బస్తిపాటి నాగరాజు కుటుంబ సభ్యుల ప్రచారం

కర్నూలు పార్లమెంటు ఎంపీ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజును గెలిపించాలని మంగళవారం ఆయన కుటుంబ సభ్యులు ఈ.తాండ్రపాడు, జోహరాపురం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. టీడీపీకి ఓటు వేయాలని వారు అభ్యర్థించారు. ప్రచారంలో నాగరాజు భార్య జయసుధ, కుమార్తె రిషిత, చిన్నాన్న, మద్దిలేటి పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు(అర్బన్), మే 7: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉపకులపతి సుధీర్ ప్రేమ్ కుమార్ సూచించారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతక ముందు క్యాంప స్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ వలంటీర్లు, ఆర్‌యూ బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.నాగరాజు, ఎన్ఎ స్ఎస్ పీవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత బాంధవుడు దామోదరం సంజీవయ్య

కర్నూలు(అర్బన్), మే 7: దళిత బాంధవుడు దామోదరం సంజీవయ్య అని డీసీసీ అధ్యక్షుడు కే.బాబురావు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కే.బాబురావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దామోదరం సంజీవయ్య అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, కాంగ్రెస్ పార్టీ కోడుమూరు, కర్నూలు అభ్యర్థులు మురళీ కృష్ణ, జిలానీ బాషా, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, అనంతరత్నం మాదిగ, ఉండవల్లి వెంకటన్న, ప్రమీల, షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): ఆంధ్రరాష్ట్ర మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య వర్ధంతిని డా.బీఆర్. అంబేడ్కర్ స్వచ్ఛ భారత్ రచ్చబండ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. మంగళవారం జిల్లా అధ్య క్షుడు వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో దామో దరం సంజీవయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమితి జిల్లా కార్యదర్శి సి.గిరిధర్, కోశాధికారి రంగస్వామి, ఉపాధ్యక్షుడు సత్యబాబు, నరసింహులు, రాంబాబు, మధు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌రెడ్డి సోదరుడి మృతి

కర్నూలు(రూరల్), మే7: టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి తమ్ముడు డి.గోవర్ధన్‌రెడ్డి(67) మంగళ వారం అకస్మికంగా మృతి చెందారు. గోవర్ధన్‌రెడ్డి పుట్టుకతో బధిరుడు కావడంతో అవివాహితుడిగా మిగిలిపోయారు. ఆయన మంచి చెడ్డలను అన్న విష్ణువర్ధన్‌రెడ్డి చూసుకునేవారు. తమ్ముడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా విష్ణువర్ధన్‌రెడ్డి కర్నూలులోనే తన నివాసంలోనే ఉంచుకున్నారు. ఆయన కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం గోవర్ధన్‌రెడ్డి భోజనం చేస్తుం డగానే ఉన్నఫలంగా కుర్చీలో కుప్పకూలిపోయారు. గమనించిన వంట మనుషులు విష్ణువర్ధన్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. విష్ణువర్ధన్‌రెడ్డి హుటా హుటీన వైద్యులను ఇంటికి పిలిపించారు. గోవర్ధన్‌రెడ్డిని పరీక్షించిన వైద్యులను ఆయన అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం పాతనగరంలోని జమ్మిచెట్లు సమీపంలో గల హిందుశ్మాశాన వాటికలో గోవర్ధన్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

పెద్దాసుపత్రికి ఈసీజీ యంత్రం విరాళం

కర్నూలు(హాస్పిటల్), మే 7: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద శ్రీచక్ర హాస్పిటల్ యాజమాన్యం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఈసీజీ మిషన్‌ను విరాళంగా అందించింది. మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డికి వైద్య పరికరాలను శ్రీచక్ర హాస్పిటల్ అధినేత డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డా.భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

తాత ముత్తాతల భూములకు ఎసరు

- ఆస్తులు లాక్కునేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు
- చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కేఈ శ్యాంబాబు
- వెల్దుర్తి మండలంలో ఎన్నికల ప్రచారం



ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ప్రచార రథంపై కేఈ శ్యాంబాబు, నాయకులు, హాజరైన ప్రజలు

వెల్దుర్తి, మే, 7: "ఎమ్మెల్యే, ఎమ్మెల్యే బావ, ఎమ్మెల్యే కొడుకు ఇసుక, భూ కబ్జాలు, అక్రమ మైనింగ్‌తో కోట్ల రూపాయలు లూటీ చేశారు.. ఇప్పుడు జగన్ తెచ్చిన దొంగచట్టం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో ఇంకా యథేచ్ఛగా నియోజకవర్గ ప్రజల తాత, ముత్తాతల నుంచి సంపాదించిన పొలాలను లాక్కునే కుట్రకు తెగబడ్డారని" మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలో రామళ్లకోట, కలగొట్ల, క్రిష్టాపురం, బుక్కాపురం, వెల్దుర్తి గ్రామాల్లో టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ.శ్యాంబాబుతో కలిసి మాజీ మంత్రి కేఈ.ప్రభాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామళ్లకోట గ్రామంలో టీడీపీ నాయకుడు రామకృష్ణ ఆచారి, రామయ్య, కలగొట్ల గ్రామంలో ఎంపీటీసీ రామకృష్ణ, సర్పంచ్ మద్దిలేటి, క్రిష్టాపురంలో సుబ్బారెడ్డి, బుక్కాపురంలో పాపిరెడ్డి, తిమ్మారెడ్డి, వెల్దుర్తిలో సుధాకర్‌గౌడు లు నాయకులకు గజమాలలతో సత్కరించారు. పూలమాలలు, బాణసంచాలతో ప్రజలు స్వాగతం పలికారు. వెల్దుర్తి పాతబస్టాండ్ కూడలిలో బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని కోరారు. తరాలనుంచి వస్తున్న భూములు లాక్కునేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారని మండిపడ్డారు. నాడు ముద్దులు పెడితే భ్రమపడి ఓట్లు వేశారని, ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడుతూ మరోసారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టీడీపీ బడుగు, బలహీన వర్గాల పార్టీఅని ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు రెండూ బీసీ అభ్యర్థులకే కేటాయించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. 13న జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలరాంగౌడు, సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడు, జయరాముడు, నాగేశ్వరరెడ్డి, వెంకటరాముడు, రమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హోసూరులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

పత్తికొండ, మే 7 : పత్తికొండ మండలపరిధిలోని హోసూరుగ్రామంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలోచేరాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఎంపీ అభ్యర్థి బస్తిపాడు నాగరాజులు వారికి కండువాకప్పి కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ అరాచకపాలనతో విసిగిపోయి టీడీపీపార్టీలోకి చేరినట్లు వారుతెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ మహిళానాయకురాలు అరుణకుమారి, హోటల్‌శ్రీనివాసులు, వాకిటిశ్రీను తదితరులుపాల్గొన్నారు.

రానున్నది టీడీపీ ప్రభుత్వమే : అరుణకుమారి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అరుణకుమారి

పత్తికొండ : రాష్ట్రంలో రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని టీడీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు డాక్టర్ అరుణకుమారి అన్నారు. పత్తికొండ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పత్తికొండలో నిజమైన అభివృద్ధి మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి పాలనలోనే జరిగిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఐదేళ్లకాలంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. వైసీపి అరాచకాలకు ప్రజలు ఓటులోబుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందని, సైకిల్‌గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అరుణకుమారి కోరారు. ఆమెతోపాటు కేఈ హరిబాబు ఉన్నారు.

రెండవ రోజు సజావుగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

ఆదోని (అగ్రికల్చర్), మే 7: స్థానిక నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో మంగళవారం రెండో రోజు సజావుగా ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పోలింగ్ నిర్వహణను పర్యవేక్షించారు. ఎన్నికల విధుల్లో పాల్గొని ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. రెండవ రోజు 727 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోగా, ఇతర జిల్లాల నియోజకవర్గాలకు సంబంధించిన ఉద్యోగులు 60 మంది తమ పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.



కడవ నీటి కోసం కన్నీరు.. పత్తికొండ మండలం నలకదొడ్డి పంచాయతీ మజర గ్రామమైన అటికలగుండులో తాగునీటి కోసం ప్రజలు తల్లడిల్లుతున్నారు. కడవ నీటి కోసం ఉదయం నుంచి సాయంకాలం వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించిందని గ్రామస్థులు కన్నీరు పెడతున్నారు. - *(ఆదోని విలేకరి)*

వేదవతిపై ప్రాజెక్ట్ నిర్మాణమే లక్ష్యం

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్
- దేవనకొండ మండలంలో విస్తృత పర్యటన
- తండ్రికి తోడుగా కుమార్తె, కుమారుడి ప్రచారం





కప్పట్రాళ్లలో ప్రచారం నిర్వహిస్తున్న వీరభద్రగౌడ్, ఏరూరులో సూపర్‌సిక్స్ పథకాలు వివరిస్తున్న మల్లికార్జున గౌడు

దేవనకొండ ,మే 7: వేదవతి నదిపై ప్రాజెక్ట్ నిర్మిస్తే లక్ష ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాలకు తాగునీరు అందించి కరువు నేలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని టీడీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని అలారుదిన్నే, కప్పట్రాళ్ల, జిల్లెడుబుడకల, కె.వెంకటాపురం, పల్లెదొడ్డి , నేలతలమర్రి, దేవనకొండ గ్రామాల్లో జనసేన ఇన్చార్జీ వెంకప్పతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులకు గ్రామాల్లో పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరభద్రగౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి తనతోనే సాధ్యమని, ఒక్క అవకాశం కల్పించాలని ఓటర్లని అభ్యర్థించారు. టీడీపీ హయాంలో మండలంలో హంద్రీనీవా పనులు చేపట్టడంతో 20 వేల ఎరకాలకు నీరిచ్చామని, ఈ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కనీసం పిల్ల కాలువ తవ్విన పాపానపోలేదని విమర్శించారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తే దాదాపు 25 వేల ఎకరాలకు సాగునీరు వస్తుందన్నారు. వైసీపీని ఓడించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోజ్జమ్మ, విజయ్‌భాస్కర్ గౌడ్, రంగన్న , మల్లికార్జునగౌడ్, రామారావునాయుడు, రామపంద్రనాయుడు, ఉచ్చిరప్ప , జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలో రాగానే హంద్రీ తూము ఏర్పాటు చేస్తాం

చిప్పగిరి, మే 7: కూటమి అధికారంలోకి రాగానే హంద్రీ కాలువపై తూము ఏర్పాటు చేసి, ఏబీసీ కాలువను అభివృద్ధి చేస్తామని ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ కుమారుడు మల్లికార్జున గౌడ్, జడ్పీటీసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మీనాక్షినాయుడు అన్నారు. మండలంలోని డేగులపాడు, ఏరూరు గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీ తూము ఏర్పాటు చేస్తే చిప్పగిరి, హాలహర్వి, ఆలూరు మండలాల్లోని దాదాపు 40వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వారు తెలిపారు. నగరడోణ జలాశయం పూర్తి చేయడం వల్ల మరో 20,000 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని వివరించారు. ప్రజలంతా ఐక్యంగా వీరభద్ర గౌడ్‌ను ఎమ్మెల్యేగా, నాగరాజును ఎంపీగా ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మీనాక్షినాయుడు, ఏరూరు మహేష్, అమరప్ప, రాజన్న, రంగస్వామి, తిమ్మప్ప, నరసింహులు, చిన్న పోతన్న, మీసాల ఆంజనేయులు, మిరపకాయల చంద్ర, హరి, రామంజనేయులు, రామచంద్ర, దానప్ప, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం : ఐశర్య

హొళగుంద, మే 7: తెలుగుదేశం పార్టీతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమని, మాజీ ముఖ్యంత్రి చంద్రబాబు మహిళల పక్షపాతి అని వీరభద్ర గౌడ్ కుమార్తె ఐశ్వర్య అన్నారు. హొళగుందలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టోకు ప్రజాదరణ పెరిగిందని అన్నారు. బీసీ కాలనీలో ఓ మహిళ కట్టెల పోయిపై ఇబ్బంది పడుతూ రొట్టెలు చేస్తుండగా.. "అమ్మా టీడీపీ ప్రభుత్వం వచ్చాక సంవత్సరానికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తారు.. అప్పుడు నీకు ఈ కష్టాలు ఉండవు" అంటూ ఐశ్వర్య కూడా రొట్టెలు కాల్చి కార్యకర్తల్లో జోష్ నింపారు. వీరభద్ర గౌడ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కన్వీనర్ తిప్పయ్య నాయకుడు, పారిశ్రామికవేత్త శివప్రకాష్, మైనారిటీ నాయకుడు మహమ్మద్ ఆదాం, ఉశూరు కాడ సిద్దప్ప, మురళి పాల్గొన్నారు.



రొట్టెలు కాల్చుతూ వీరభద్రగౌడ్ కుమార్తె ఐశ్వర్య వినూత్న ప్రచారం

భూకబ్జాలతో ఆదోనిని ముంచారు

- పట్టణంలో కూటమి నాయకులతో కలిసి డాక్టర్ పార్థసారథి విస్తృత ప్రచారం



ఆదోనిలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి

ఆదోని, మే 7: పశ్చిమ ప్రాంతమైన ఆదోని రెండో ముంబైగా పేరు ఉండేదని, భూ కబ్జాలు, ఇసుక, రేషన్ బియ్యం, మద్యం మాఫియా చేస్తూ తన కుటుంబం బాగుపడింది తప్ప, ప్రజలు ఎవ్వరూ బాగుపడలేదని ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారధి అన్నారు. మంగళవారం పట్టణంలోని సంతపేట, చాకలిగేరి, ఖాజీపూరంలో జనసేన నాయకులు మల్లప్ప, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరితో కలిసి ఇంటింటి ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలు, మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం పార్థసారధి మాట్లాడారు. 10 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న సాయిప్రసాద్ రెడ్డి ఆదోని అభివృద్ధి కోసం అసెంబ్లీలో ఎప్పుడు గళం విప్పలేదన్నారు. ఎంతసేపు భూకబ్జాలు, వైన్స్, మైన్స్, శాండ్, విలువైన స్థలాలు కనిపిస్తే కబ్జాలు చేయడమే ఆయన నైజం అన్నారు. అలాంటి వ్యక్తిని ఆదోని ప్రజలు ఎలా గెలిపిస్తారని వాపోయారు. ఐదేళ్లకొకసారి వచ్చే ఎన్నికలలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్స్ మధ్యన ఘర్షణలు పెట్టి, వారి ఓటు బ్యాంకును కొల్లగొట్టి పబ్బం గడుపుకోవడమే సాయిప్రసాద్ రెడ్డి నైజమన్నారు. పశ్చిమ ప్రాంతమైన ఆదోని నియోజకవర్గం బాగా వెనకబడిందని, తాగు, సాగునీరు లేక చిన్న సన్నకారు రైతులు పిల్లాపాపలతో పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఆదోని నియోజకవర్గాన్ని రెండవ ముంబాయిగా పేరు తేవాలి అంటే ఒక్కసారి తనను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వ నిధులతో ఖచ్చితంగా పరిశ్రమలు తెస్తానని, యువతకు ఉపాది అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.

వైసీపీలో చేరలేదు.. బలవంతంగా తీసుకెళారు

మద్దికెర, మే 7: తాము వైసీపీలో చేరలేదని, బలవంతంగా తీసుకెళ్లారని మండలంలోని హంపా గ్రామానికి చెందిన హరిజన నాగరాజు, దుర్గాప్రసాద్, ఆంజనేయులు, రాజు, లాలెప్ప తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 6న తమ గ్రామానికి చెందిన కొంత మంది యువకులు ఆర్డీటీ స్థలం విషయంపై ఎమ్మెల్యే శ్రీదేవమ్మతో మాట్లాడాలంటే వెళ్లామని, బలవంతంగా వైసీపీ పార్టీ కండువాలు కప్పారని అన్నారు. తాము తెలుగుదేశం పార్టీ మారే ప్రసక్తే లేదని, తామంతా తుగ్గలి నాగేంద్ర అనుచరులమని పేర్కొన్నారు.

రెండవ రోజు 1001 పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

ఎమ్మిగనూరు రూరల్, మే7: ఎన్నికల్లో భాగంగా రెండవ రోజు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంతో పాటు, ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండవ రోజు మంగళవారం 1001 ఓట్లు పోలయ్యాయి

భూములు లాక్కోవడానికే
జగన్ డ్రామా

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి : బీవీ డిమాండ్



వీవర్స్ కాలనీ చేనేతల సమావేశంలో మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి, హాజరైన చేనేతలు, పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

నందవరం, మే 7: పేదల భూములు లాక్కోవడానికే జగన్ ప్రభుత్వం కొత్త డ్రామా ఆడుతోందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌ను కలిసి జగన్ ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ చట్టన్ని రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కొత్త చట్టం వలన తమ భూములకు రక్షణ లేకుండా పోతుందని ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని, తమకు తెలియకుండా వేరే వ్యక్తులు తమ భూములను కాజేసే అవకాశం ఉందని భయాందోళనలు చెందుతున్నారని అన్నారు. ఇలాంటి చట్టం దేశంలో ఎక్కడాలేదని, భూములకు రక్షణ లేకుండా చేసే ఈ చట్టన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, బండేగురుస్వామి, గురురాజారావు, నాగరాజుగౌడు, డీవీ రాముడు, కాశీంవలీ, ధర్మాపురం గోపాల్ తదితరులు ఉన్నారు.

కాపలాదారుగా ఉంటా..చేనేతలకు అండగా నిలబడతా

ఎమ్మిగనూరు: ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఎమ్మిగనూరు ప్రజలకు కాపలాదారుడిగా.. మీలో ఒకడినై మీకు సేవలు అందిస్తానని బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 26వ వార్డు వీవర్స్ కాలనీలో వార్డు ఇన్‌చార్జి బిజ్జె నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత ఆత్మీయ సమావేశంలో బీవీ మాట్లాడారు. చేనేతలకు అండగా ఏ కష్టమొచ్చినా నిలబడతానని, కల్లబొల్లి మాటలకు, డబ్బు సంచులతో వచ్చిన వారిని చూసి మోసపోవద్దని కోరారు. నిత్యం మీలో ఒకడిగా తిరిగే నన్ను, ఎంపీగా బస్తిపాటి నాగరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని కో రారు. కార్యక్రమంలో నాయకులు మాజీ కౌన్సిలర్ మాచాని శివకుమార్, నాగరాజు, ఈరన్న, చేనేత మల్లి, పట్టా నాగరాజు, మిన్నప్ప, నరసింహులు, కామార్తి మహేష్, భాస్కర్ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ల సంపూర్ణ మద్దతు

పట్టణంలోని పద్మశాలి కమ్యూనిటి హాల్‌లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రీషియన్ల సమావేశంలో బీవీ జయనాగేశ్వరరెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్లకు ఆశించిన స్థాయిలో ఉపాధి లేదని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారి ఆర్థికాభివృద్ధికి తనవంతు కృషి చేస్తాని హామీ ఇచ్చారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 5, 15,16,21,22 వార్డుల్లో టీడీపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కడివెళ్ల, కందనాతి, మాస్‌మాన్‌దొడ్డి గ్రామాల్లో బీవీ పర్యటించి తననుగెలిపించాలని కోరారు.

టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు

పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన తటస్తులు, వైసీపీ కార్యకర్తలు, నాయకులు బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. తీర్థం పుచ్చుకుంటున్నారు. పట్టణానికి చెందిన లక్ష్మణ్ సినీ థియేటర్ యాజమాన్య కుటుంబ సభ్యులు రాము, కొమ్మురావు, వినయ్‌కుమార్, శేఖర్, హనుమంతు, రోహన్, తరుణ్‌లతో పాటు మరో 50 మంది టీడీపీలో చేరారు. నాగలాపురానికి చెందిన 30కుటుంబాలు, 19వ వార్డులోని ఇందిరానగర్‌లోని 100 కుటుంబాలు, గోనెగండ్లకు చెందిన 30 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

అగ్రహారంలో బీవీకి నీరాజనం



గోనెగండ్ల: బి. అగ్రహారం గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీవీ జయనాగేశ్వరరెడ్డికి జనం నీరాజనం పలికారు. మేళతాళ లతో బాణ సంచపేల్చుతూ భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీవీ సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



← ప్రచారంలో మాట్లాడుతున్న బీవీ, హాజరైన అగ్రహారం ప్రజలు

బాలనాగిరెడ్డికి బుద్ధి చెప్పండి

- దేవుని సాక్షిగా ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
- 'ఇళ్లదగ్గరికి వెళితే హీనంగా కాళ్లదగ్గర కూర్చోబెడతారు'
- కోసిగి మండలంలో టీడీపీ ఎన్నికల ప్రచారం



కోసిగిలో రోడ్‌షోకు గుమ్మడికాయతో దిష్టి తీస్తున్న టీడీపీ శ్రేణులు, చంటి బాలుడిని ముద్దాడుతున్న రాఘవేంద్రరెడ్డి, బూదూరులో రఘునాథరెడ్డి ప్రచారం, కోసిగి సంజీవగేని ఈరన్నను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి మే 7: " ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డితో పాటు ఆయన కుమారుడు ధరణీధర్ రెడ్డి పరమశివుడు, కోసిగి రేణుకా ఎల్లమ్మ సాక్షిగా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి.. నిగ్గదీసి అడిగి ఓటుతోనే బుద్ధి చెప్పండి" అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి కోసిగి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కోసిగిలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, తోవి రామక్రిష్ణ, అయ్యన్న, వక్రాణి వెంకటేష్, నర్సారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా సమస్యలే.. కనీసం తాగేందుకు నీరు లేదని, మళ్లీ ఇప్పుడు ఓట్లేయండని వస్తున్నాడు.. ఇలాంటి వ్యక్తికి ఓటుతోనే సమాధానం చెప్పండని కోరారు. సోమిశెట్టి మాట్లాడుతూ గ్రామాల్లో వైసీపీ నాయకులే బాలనాగిరెడ్డిపై ఆగ్రహంగా ఉన్నారని, నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుతున్నారని, రాఘవేంద్రరెడ్డి గెలుపు ఖాయమయ్యిందని స్పష్టం చేశారు. రోడ్‌షోకు మండల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో రోడ్లన్నీ పసుపుమయం అయ్యాయి. జనసేన నాయకులు వాల్మీకి లక్ష్మన్న, చింతలగేని నర్సారెడ్డి, పెండ్యాల భరద్వాజ్‌శెట్టి, కోసిగయ్య, ఉరుకుందు, సొట్టయ్య, ఖలందర్, గౌస్, గాలెం వీరేష్, పోతుల వీరారెడ్డి, గణపతి రాముడు పాల్గొన్నారు.

బూదూరులో రఘునాథరెడ్డి ప్రచారం

మంత్రాలయం: ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు, మాధవరం మాజీ సర్పంచు రఘునాథరెడ్డి బూదూరు గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ది చెప్పాలని కోరారు. టీడీపీ నాయకులు కరెంటు అబ్రహం, రోగెప్ప, దావీదు, నాగరాజు పాల్గొన్నారు.

అలాగే ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి నివాసంలో పెద్దకడుబూరు నుంచి 33 వైసీపీ కుటుంబాలు, చిలకలడోనలో 20 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు.

'ఇళ్ల దగ్గరకు వెళితే కాళ్లదగ్గర కూర్చోబెడతారు'

కోసిగి : కోసిగికి చెందిన విద్యావంతుడు. వ్యాపారవేత్త సంజీవగేని ఈరన్న ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు టికెట్ ఇస్తే వైసీపీ నాయకుల్లో వణకు మొదలైందన్నారు. వైసీపీ నాయకులు ప్రజలను హీనంగా చూస్తారని, తమ ఇళ్లకు వచ్చిన ప్రజలను కాళ్ల కింద కూర్చోబెట్టుకుని అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్హతలు ఉన్న తననే మురళిరెడ్డి ఆయన ఇంటికి వెళ్లినప్పుడు 20 నిమిషాల పాటు వెయిట్ చేయించి అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇలాంటి పెత్తందారులకు ఓటుతో బుద్దిచెప్పాలని కోరారు.